వంతెన గతి ఇంతేనా..?

- శిథిలావస్థకు చేరిన కాకతీయకాలువ బ్రిడ్జి
- పట్టించుకోని అధికారులు


వంతెనపై ఏర్పడిన గుంత


వెంచిర్యాల్ శివారులో కాకతీయ కాలువపై ఉన్న వంతెన

బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ శివారులో కాకతీయ కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. కొన్నాళ్లుగా వంతెన గురించి పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోర్తాడ్ మండలం దొన్కల్ జాతీయ రహదారి–63 నుంచి మెండోరా మండలం చాకిర్యాల్ వద్ద జాతీయ రహదారి–44ను కలుపుతూ నిర్మించిన లింకు రోడ్డు ముప్కాల్ మండలం వెంచిర్యాల్ వద్ద కాకతీయ కాలువను దాటుతూ వెళ్తోంది. లింకు రోడ్డుకు పలుమార్లు మరమ్మతులు చేపట్టి డబుల్ రోడ్డు చేశారు. కానీ వంతెన నిర్మాణాన్ని మరిచారు. దూర భారం తగ్గడం వల్ల నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. వంతెన మరమ్మతుల గురించి కాని, ఇరుకు వంతెనను వెడల్పు చేయటం గురించి కానీ పాలకులు ఆలోచన చేయలేదు. దీంతో ప్రయాణికులు వంతెనపై నుంచి ప్రయాణించటానికి జంకుతున్నారు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు లేదంటే వంతెన వెడల్పు చేస్తూ నూతనంగా నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత..

శిథిలావస్థలో ఉన్న వంతెనపై గుంత ఏర్పడింది. ఆ గుంతను పూడ్చకపోతే అనేక ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉంది. అసలే వంతెన ఇరుకుగా ఉంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చే అవకాశం లేదు. ఒక వాహనం వెళ్లిన తర్వాతనే మరో వాహనం వెళ్లాలి. వంతెన ముందర రోడ్డు లోతుగా ఉంటుంది. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించవు. అలాంటి వంతెనపై గుంత ఉంది. కనీసం గుంతనైనా పూడ్చాలనే ఆలోచన కూడా అధికారులు చేయడం లేదు.

ప్రతిపాదనలు పంపించాం

కాకతీయ కాలువపై వంతెన విస్తరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గుంతను వెంటనే పూడ్చే ఏర్పాట్లు చేస్తాం. మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

– రఘుపతి, డిప్యూటీ ఈఈ, కాకతీయ కాలువ

నివాసాలపై విద్యుత్ తీగలను తొలగించాలి

- నవీపేట మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల విన్నపం
- సమస్యలపై వాడీవేడిగా సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ సంగెం శ్రీనివాస్

నవీపేట: ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ గ్రామాల సభ్యులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో నివాస గృహాలపై వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని గతంలో పలుసార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని ఎంపీటీసీ–2 మీనా అసహనం వ్యక్తం చేశారు. ఎవరికైనా ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే ట్రాన్స్‌కో అధికారులే బాధ్యత వహించాలన్నారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్, ప్రభుత్వ కోటాల కింద పనులు ఉంటాయంటున్న అధికారులు ప్రమాదాలు జరిగితే ఎలా స్పందిస్తారని ఎంపీటీసీ–3 సతీష్ ప్రశ్నించారు. వర్షా కాలం ఆరంభమైన నేపథ్యంలో సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఏవో గైర్హాజరవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో మన ఊరు–మన బడి కింద గ్రామాలలోని పాఠశాలల్లో మరమ్మతులు, అదనపు గదులు నిర్మించామని, ఇంత వరకు బిల్లులు రాలేదని నిజాంపూర్ ఎంపీటీసీ కృష్ణమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు చేసి చేపట్టిన పనులకు వడ్డీలు పెరుగుతున్నాయని అన్నారు. ఎంపీటీసీల కాలం ముగిశాక అధికారులను గ్రామాలలో తిరగనీయమని మండిపడ్డారు. మండల కేంద్రంలో బాసర రహదారి వెంబడి ప్రధాన మూల ములుపుల దగ్గర స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కో–ఆప్షన్ సభ్యుడు అల్తాపుద్దీన్ కోరారు. అలాగే పలువురు సమస్యలు లేవనెత్తారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ నీరడి సవిత, ఎంపీడీవో నాగనాథ్, తహశీల్దార్ నారాయణ పాల్గొన్నారు.

అటవీ సంపదను కాపాడాలి


మాట్లాడుతున్న రుద్రూర్ సీఐ జేఎస్ రెడ్డి

వర్ని: పోలీసు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి అటవీ సంపద కబ్జా కాకుండా కాపాడాలని రుద్రూర్ సీఐ జేఎస్ రెడ్డి అన్నారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలోని అటవీ కార్యాలయంలో పోలీసు అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అటవీ భూమి కబ్జా కాకుండా పోలీసులు, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి సంపదను కాపాడాలని సూచించారు. అధికారులపై ఎవరైనా జులూమ్ చేసి దౌర్జన్యానికి పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తామని, ఈ విషయాలపై అటవీ ప్రాంతంలో ఉన్న రైతులు, ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వర్ని అటవీ పరిధిలోని మోస్రా, చందూర్, వర్ని మండలాల్లో అటవీ భూమి కబ్జాకు పాల్పడుతున్న 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వర్ని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబు, సెక్షన్ ఆఫీసర్లు కుద్బుద్దీన్, ప్రభాకర్, బాసిత్, చంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.

'ఇక్కడ వాహనాల ఆనవాళ్లు గల్లంతు'

ఆర్మూర్‌టౌన్: వాహనాల చోరీకి పాత ఇనుప సామాన్ దుకాణాలే అడ్డాగా మారాయి. దొంగలించిన వాహనాల ఆనవాళ్లు లేకుండా చేయడంలో స్క్రాప్ దుకాణాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. రూ.లక్షల విలువైన వాహనాలను పార్ట్ పార్ట్‌గా విడదీసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చోరీ చేసిన వాహనాలే కాకుండా బోరు బావి మోటర్లు, స్టాటర్‌లు, విద్యుత్ తీగలు, కాపర్‌వైర్లు స్క్రాప్ దుకాణాల నిర్వాహకులు దొంగల నుంచి కొనుగోలు చేస్తున్నారు. స్క్రాప్ దుకాణాల్లో పెద్ద ఆదాయం వస్తుందని గమనించిన పలువురు ఆ వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవలే మెట్‌పల్లిలో బైక్ దొంగతనాల వ్యవహారంలో ఆర్మూర్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి పాత్ర చర్చనీయాంశంగా మారింది. మెట్‌పల్లికి చెందిన ఇస్మాయిల్ జల్సాలకు బానిసై వాహనాలను చోరీ చేస్తూ ఆర్మూర్ ప్రాంతంలోని పలు స్క్రాప్ దుకాణాల్లో విక్రయించాడు. మెట్‌పల్లి పోలీసులు కూపీ లాగగా ఆర్మూర్ ప్రజాప్రతినిధి సైతం నిందితుడి నుంచి బైక్‌లను కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. దీంతో ఆ ప్రజాప్రతినిధిని పోలీసులు నాలుగు రోజుల పాటు విచారణ చేసి కేసు నమోదు చేశారు. స్క్రాప్ దుకాణాలపై పోలీసులు నిఘా పెంచి వాహనాలు చోరీ కాకుండా చూడాలని పుర ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న బడిబాట

జిల్లాలో బడిబాట కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే బడి ఈడు పిల్లల్ని పనుల్లోకి కాకుండా పాఠశాలల్లో చేర్పించాలని సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఫీజుల భారం ఉండదని, ఉచితంగా నోట్ బుక్కులు, పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఇస్తారని, మధ్యాహ్న భోజనం లభిస్తుందన్నారు. పిల్లలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


బుస్సాపూర్‌లో బడిబాటలో ఉపాధ్యాయులు


జానకంపేటలో ర్యాలీ


కుకునూర్‌లో పోస్టర్లతో ప్రచారం


రెంజల్: అంగన్‌వాడీ పిల్లలను స్థానిక పాఠశాలలో చేర్పిస్తున్న టీచర్లు

పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలి



రెంజల్(బోధన్): పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ప్రమీలారాణి సూచించారు. కళ్యాపూర్ గ్రామంలో గల రెండు అంగన్‌వాడి కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించారు. 3 నుంచి 5 సంవత్సరాల వయసున్న చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. టీచర్లు అంగన్‌వాడి బాట నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులు ఇంటి ముందు న్యూట్రిగార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

కేదార్‌నాథ్‌ను దర్శించుకున్న కోల్పూర్ ఆశ్రమ కమిటీ సభ్యులు



నందిపేట్ (ఆర్మూర్): కోల్పూర్ గ్రామంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమ కమిటీ సభ్యులు శుక్రవారం హిమాలయాలలోని కేదార్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. 75 రోజుల క్రితం ఆశ్రమం నుంచి ఆశ్రమం వ్యవస్థాపకులు చింత రమేష్ స్వామి ఆధ్వర్యంలో పలువురు పాదయాత్రగా 1900 కిలోమీటర్లు నడిచి మూడు రోజుల క్రితం బద్రీనాథ్‌కు చేరుకున్నారు. అక్కడి నుండి పాదయాత్రగా వెళ్లి కేదార్‌నాథ్‌ను శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్‌లో గల ప్రవేట్ పాఠశాలల బస్సులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వినియోగిస్తున్నారని, అలాంటి పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌వీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ నాయక్ డిమాండ్ చేశారు. పెర్కిట్‌లోని ఎంఈవో కార్యాలయంలో టీఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నింబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఫిట్‌నెస్ లేని, నింబంధనలు పాటించని పాఠశాల బస్‌లను సీజ్ చేయాలన్నారు.

సమాచారం

- జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో గణితం, భౌతిక, రసాయనిక, వృక్ష, జంతు శాస్త్రం బోధించటానికి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ ముబీన్ తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 10లోపు కళాశాలలో అందజేయాలని కోరారు.

విద్యార్థుల సంఖ్య మరింత పెంచాలి



భీమ్‌గల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలని ఎంపీడీవో గంగుల సంతోష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమంపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి బాలుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, డ్రాప్ ఔట్ పిల్లలు లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో స్వామి, ఎస్ఐఐ హరిబాబు, ఏపీఎం–2 రవీందర్, ఐసీడీఎస్ సూపర్వైజర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా చేపల విక్రయం

బాల్కొండ/నందిపేట: శుక్రవారం మృగశిర కార్తె కావడంతో చేపలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో గ్రామాల్లో చెరువుల వద్ద మత్స్యకారులు అధికంగా చేపల వేటను కొనసాగించారు. చేపల మార్కెట్ వద్ద ప్రజలు గుమిగూడారు. ఉదయం నుంచే చేపల మార్కెట్లు సందడిగా మారాయి. మృగశిర కార్తె రోజు చేపలను తినడం సంప్రదాయంగా వస్తుంది. పల్లెల్లో కూడ చేపలకు ధర పెరిగింది. కిలో రూ.180 నుంచి 200 వరకు విక్రయించారు.


కుద్వాన్‌పూర్‌లో చేపలు పడుతున్న జాలర్లు


పోచంపాడ్‌లో చేపల కొనుగోలు

నిరుపయోగంగా మహిళా సమాఖ్య భవనం



వేల్పూర్: మండల కేంద్రంలో 20 ఏళ్ల కిందట నిర్మించిన మహిళా సమాఖ్య భవనం కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఉపాధి హామి, మహిళా సమాఖ్యకు కలిపి కొత్త భవనాన్ని ఐదారేళ్ల కిందట నిర్మించడంతో మహిళా సమాఖ్య వారు తమ కార్యాలయాన్ని అందులోకి మార్చుకున్నారు. దాంతో అప్పట్నుంచి పాత భవనం వృథాగా ఉంటోంది. అప్పట్లో మండల పరిషత్ కార్యాలయం వెనుక సుమారు రూ.30 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. కొత్త భవనాన్ని నిర్మించిన తరువాత పాత భవనంలో మహిళలకు స్వయం సమృద్ధి పథకాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యాలయంగా వాడుకోవడం, లేదా నిరుద్యోగ మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పాలని భావించారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించే విధంగా స్వయం సమృద్ధికి అవసరమైన పరిశ్రమ కేంద్రాన్ని నెలకొల్పాలని భావించారు. దీని కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న గత సంవత్సరం వేల్పూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న స్పైస్‌పార్కులో పరిశ్రమ ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు. దీంతో మహిళా సమాఖ్యలో ఏర్పాటు అవుతుందనుకున్న స్వయం సమృద్ధి పరిశ్రమ స్పైస్‌పార్కు ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోవడంతో స్పైస్‌పార్కులో ఏర్పాటవుతుందని భావించిన పరిశ్రమ ఆగిపోయింది. మండల పరిషత్ ఆఫీసు వెనుక వృథాగా ఉంటున్న మహిళా సమాఖ్య భవనంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం కూడా మరుగున పడింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత మహిళా సమాఖ్య భవనంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని నిరుద్యోగ మహిళలు కోరుతున్నారు.

ఎరువుల కొరత రానివ్వొద్దు


బాల్కొండలో తనిఖీ చేస్తున్న అధికారి

బాల్కొండ: ఖరీఫ్‌లో రైతులకు ఎరువుల కొరత రానివ్వొద్దని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలోని ఎరువుల, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంప్లెక్స్, యూరియా ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. మండలంలో ప్రస్తుతం సహకార సంఘం ద్వారా 1400 బస్తాల యూరియా, 2 వేల బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, ప్రయివేటు దుకాణాల ద్వారా 2,225 బస్తాల యూరియా, 1,100 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువుల డీలర్లు తప్పకుండా స్టాక్ రిజిస్టర్‌ను, బిల్ బుక్‌లను అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక


మాట్లాడుతున్న పద్మశాలి సంఘ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆదివారం జిల్లా పద్మశాలి మహిళా సంఘం, పద్మశాలి ఆత్మీయ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో పద్మశాలి పరిణయ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, పరిచయ వేదిక చైర్మన్ గుజ్జ రాజేశ్వరి, సేవా సమితి అధ్యక్షుడు రాపెల్లి గురుచరణ్ పేర్కొన్నారు. నగరంలోని కోటగల్లి పద్మశాలి సంఘంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రేపు ఉదయం పది గంటలకు పరిచయ వేదిక కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పెళ్లి సంబంధాలు అవసరమున్న పద్మశాలీలు తమ అమ్మాయి, అబ్బాయి బయోడాటాతో నేరుగా కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. సంబంధాలు కుదిరిన పేద పద్మశాలీలకు ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తామన్నారు. సంఘ ప్రతినిధులు పుల్లం హనుమాండ్లు, అవధూత దశరథం, గుడ్ల భూమేశ్వర్, చింతల గంగాదాస్, గుడ్ల చంద్రబాగ, బింగి మోహన్, బండి నరహరి, లక్కవత్రి దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 93466 45161, 99855 66374, 98666 03879, 98665 57115, 98482 29322, 95732 32778, 98482 25563ను సంప్రదించాలన్నారు.

జిమ్ నిర్వాహకులకు కౌన్సెలింగ్



ఖలీల్‌వాడి: నగరంలోని జిమ్ నిర్వాహకులు, ఓనర్లకు శుక్రవారం టౌన్ సీఐ కార్యాలయంలో ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ నరహరి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ప్రతి నిర్వాహకుడు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. జిమ్‌కు వచ్చేవారు గ్యాంగులు ఏర్పాటు చేయవద్దన్నారు. గ్యాంగులను జిమ్‌లోకి అనుమతి ఇవ్వవద్దన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, మాదకద్రవ్యాల సమాచారం ఉన్నట్లయితే పోలీసులకు తెలపాలన్నారు. ఎస్సైలు రామ్, ప్రవీణ్, సంజీవ్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్–1 – లవ్‌బాయ్స్ (తెలుగు) – 11.05, వెపన్ (తెలుగు) – 1.50, భజే వాయువేగం – 4.30, లవ్‌మౌళి (తెలుగు) – 7.25, రక్షణ – 10.30
- స్క్రీన్–3 – మనమే (తెలుగు) – 11.45, 3.00, 6.15, 9.30
- స్క్రీన్–4 – సత్యభామ – 10.50, 4.50, 10.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి – 1.45, బ్యాడ్‌బాయ్స్ – 7.45

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవీపేట: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ వార్డు సభ్యుడు నవీన్‌రాజ్ శుక్రవారం ఎంపీడీవో, ఎంపీపీలకు వినతి పత్రం సమర్పించారు. మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగా ఈ సమస్యలను వివరించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు క్రీడా మైదానం లేక అవస్థలు పడుతున్నారని, పక్కనే ఉన్న ఎఫ్‌సీఐ ఖాళీ స్థలాన్ని కేటాయించాలని కోరారు. నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరారు. అలాగే సుభాష్‌నగర్ కాలనీలో పల్లె దవాఖానా పనులు ప్రారంభించాలని కోరారు. నందిగామలో రూ.30 లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించలేదని జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంజీవ్, కాంట్రాక్టర్ భూంరావ్‌లు ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు.

క్లినిక్‌ల తనిఖీ



నవీపేట: మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను వైద్య సిబ్బంది శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ఎంపీల లైసెన్స్‌లు, పడక గదుల అనుమతులు తదితర అంశాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సామ్రాట్, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటేశ్వర్ రావ్, సూపర్‌వైజర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు..



మాక్లూర్: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి పద్మ, తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఎస్సై సుధీర్‌రావులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు ఉన్నాయా లేదా అనేది పరిశీలించారు. అలాగే ఎరువులు ఎప్పుడు తయారయ్యాయి.. అది వాడటానికి టైం ఉందా లేదా అనేది కూడ క్షుణ్ణంగా పరిశీలించారు. కొనుగోలు చేసిన ప్రతి సరుకుకు సంబంధించి రైతులకు బిల్లులు ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని, అధికారులు ఎరువుల డీలర్లతో కరాఖండిగా చెప్పారు. దుకాణాల్లో నాణ్యమైన మంచి కంపెనీల పురుగుల మందులతో పాటు నాణ్యతతో కూడిన విత్తనాలనే రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు.

పేదలకు తోపుడు బండ్ల అందజేత



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పట్వారి గోపికృష్ణ అధ్యక్షతన రోటరీ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ హనుమంత్ రెడ్డి తండ్రి నల్ల వెంకట్ రెడ్డి గారి స్మారకార్థంగా పేదలకు తోపుడు బండ్లు అందజేశారు. చిరు వ్యాపారులకు రూ. 1,60,000 విలువ గల 10 తోపుడు బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి కోసం చిరు వ్యాపారాలు చేసుకుంటున్న నిరుపేదలకు సొంతగా బండి లేని వారికి తమ వంతు సహకారం అందించామన్నారు. రోటరీ కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, కాంతి గంగారెడ్డి, విజయసారథి, చరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్‌కు ఆర్థిక సాయం



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని మైనార్టీ కళాశాలలో ఇంటర్మీడియల్ చదివిన విద్యార్థిని ఎర్రం నీతు ఇటీవల ఇంటర్ బైపీసీలో 966 మార్కులు సాధించింది. దీంతో విద్యార్థిని పై చదువుల కోసం కావాల్సిన ఆర్థిక సహాయం కోసం చిట్టాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డిని కోరారు. దీంతో ఆమె ప్రతిభను గుర్తించిన ఆయన లాంగ్‌టర్మ్ నీట్ కోచింగ్ కోసం కావాల్సిన ఫీజు రూ.2.15 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. కష్టపడి చదివి భవిష్యత్తులో మంచి డాక్టర్ కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ రాజు కుమార్ పాల్గొన్నారు.